క్లుప్తంగా

స్పెషల్ డ్రైవ్‌కు దరఖాస్తులు వెల్లువ



దరఖాస్తులను స్వీకరిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

మాడ్గుల: భూ సమస్యల పరిష్కారానికి ధరణి స్పెషల్ డ్రైవ్‌కు దరఖాస్తులు వచ్చాయి. మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌కు 40 దరఖాస్తులు వచ్చాయి. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. రైతులు భూ సమస్యలను తమ దృష్టికి తీసుకోస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

తలకొండపల్లి: మండలంలోని చుక్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా ఆస్మాఫాతీమా, డీఈఓగా మౌనిక, ఎంఈఓగా ఎండీ ఖలీల్ పాష, హెచ్‌ఎంగా ప్రహర్ష్, ఉపాధ్యాయులుగా లక్ష్మీ, జగదీశ్వరీలతో పాటు, మరి కొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు, ప్రసన్నలక్ష్మీ, శ్రీదేవి, వెంకట్ పవార్, సురేష్, మాల్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ అర్జీలను ఉచితంగా పరిష్కరించాలి

యాచారం: ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఉచితంగా పరిష్కరించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సర్కార్ ఎల్‌ఆర్‌ఎస్ అర్జీలను ఉచితంగా పరిష్కరించి పేదలకు మేలు చేయాలని కోరారు. అక్రమ వెంచర్లల్లో అత్యధికంగా పేదలే ప్లాట్లు కొనుగోలు చేశారని, ఉచితంగా పరిష్కరిస్తే పేదలకు లబ్ధి చేకూరుతోందన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నిర్మాణ పనులను ప్రారంభించిన నాయకులు

మంచాల: మండలంలోని చెన్నారెడ్డిగూడలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను శనివారం ప్రారంభం చేశారు. రూ.7.50 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు వేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పీఏసీఎస్ డైరెక్టర్ జెనిగె వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిషన్, మాజీ ఉప సర్పంచ్ పరమేశ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం పరిశీలన



పరీక్షా సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మంచాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ బాలశంకర్ శనివారం సందర్శించారు. విద్యార్థులకు తాగునీరు, సరిపడా బెంచీలు వంటి మౌలిక వసతుల కల్పన ఎలా ఉందని ఆరా తీశారు. సెంటర్ వద్ద ఉన్న ఆశ వర్కర్లతో కూడా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ తేజ్‌సింగ్ పాల్గొన్నారు.

ఆమనగల్లు సీఐగా ప్రమోద్‌కుమార్

ఆమనగల్లు: ఆమనగల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.ప్రమోద్‌కుమార్ బదిలీపై వచ్చారు. ఆమనగల్లు సీఐగా ఉన్న విజయ్‌కుమార్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. గత నెల 21న ఆమనగల్లు సీఐగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్ పది రోజులకే బదిలీ కావడం విశేషం. ప్రస్తుతం ఆల్వాల్ పీఎస్‌లో పనిచేస్తున్న ప్రమోద్‌కుమార్ ఆమనగల్లు వచ్చారు.

భూ సమస్యలకు చెక్

- మండలంలో రెండు రెవెన్యూ బృందాల ఏర్పాటు
- పెండింగ్ దరఖాస్తులు 353
- త్వరితగతిన పరిష్కరిస్తాం.. డిప్యూటీ తహసీల్దార్ సంతోష్

తలకొండపల్లి: భూ దస్త్రాల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఆ దిశలో రెవెన్యూ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 1 నుంచి 9 వరకు పెండింగ్ భూ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తలకొండపల్లి మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు గాను రెండు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 353 పెండింగ్ దరఖాస్తులున్నాయి. ఖాస్రా, పహాణీ, సేత్వార్, భూక్రయ, విక్రయాలకు సంబంధించి భూ పట్టా పేర్లు మారిడి, భూ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, విరాసత్, పాస్ బుక్‌లు, కోర్టు కేసుల సమస్యల పరిష్కారం, తదితర వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల వారీగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు.



తహసీల్దార్ కార్యాలయం

గ్రామాల వారీగా షెడ్యూల్ వివరాలు....

మార్చి 1న రాంపూర్, మెదక్‌పల్లి, లింగరావుపల్లి, రామకృష్ణాపురం, 2న పడకల్, చంద్రధన, జూలపల్లి, 4న తలకొండపల్లి, బద్నాపూర్, చుక్కాపూర్, యడవల్లి, 5న చెన్నారం, చీపునుంతల, అంతారం, వెంకటాపూర్, 6న వెల్జాల్, తిమ్మాపూర్, ఖానాపూర్, గౌరిపల్లి, 7న వెంకట్రావ్‌పేట్, గట్టుఇప్పలపల్లి, తదితర గ్రామాల్లోని భూ సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించనున్నారు. ప్రతి దరఖాస్తుకు అనుబంధంగా ఆధారాలను సేకరిస్తున్నారు. క్షేత్రస్థాయి విచారణకు వీలుగా షెడ్యూల్ నిర్ణయించుకుంటున్నారు.

ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తాం

మండలంలో 353 పెండింగ్ దరఖాస్తులున్నాయి. వీటి పరిష్కారానికి రెండు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేశాం. ప్రతి రోజు రెండు నుంచి 4 గ్రామాల చొప్పున సమస్యలను పరిష్కారానికి ప్రత్యేక షెడ్యూల్ రూపొందించాం. నిబంధనల మేరకు ప్రతి దరఖాస్తును పరిశీలిస్తాం. అవసరమనుకుంటే క్షేత్రస్థాయిలో ఫీల్డ్ విజిట్ చేసి సమస్యను పరిష్కారిస్తాం. అనంతరం ప్రత్యేక నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తాం.

–సంతోష్, డిప్యూటీ తహసీల్దార్, తలకొండపల్లి

మానవ మనుగడకు చెట్లే ఆధారం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: మానవాళి మనుగడకు చెట్లే ప్రాణాధారమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరు ఇంటింటా చెట్లు పెంచి పచ్చని గ్రామాలుగా మార్చాలని పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడారు. మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టి అడవుల అభివృద్ధికి దోహదపడాలన్నారు. చెట్లుంటే సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొంది సంవత్సరానికి రెండు పంటలు పండే అవకాశముందన్నారు. తద్వారా ఆహారధాన్యాలు విపరీతంగా పండి దేశంలో ఆకలి కొరత తీరనుందన్నారు. చెట్లుంటే క్షేమమని, లేకుంటే క్షామమన్నారు. ప్రతి గ్రామంలో విత్తనాలు నాటి నర్సరీల పెంపకం చేపట్టాలన్నారు. ఎదిగిన నర్సరీల మొక్కలను వ్యవసాయ పొలాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, చెరువు గట్లు, కట్టపై నాటి మొక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ కార్యదర్శులు అంజయ్యగుప్తా, రవీందర్ యాదవ్, దామోదర్, రఘురాములు, డేవిడ్, చెన్నకేశవులు, పవన్ వాల్మీకి, యాదయ్య పాల్గొన్నారు.



ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి, తదితరులు

అధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

డీసీసీబీ ఛైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం తుర్కయంజాల్‌లో నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయ పనులను పరిశీలించారు. దాతలు విరాళాలు ఇచ్చి నిర్మాణ పనులు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని ఆలయ కమిటీ సభ్యులను కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజుగౌడ్, నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆలయ పనులను పరిశీలిస్తున్న సత్తయ్య

పశుపోషణపై జాగ్రత్తలు తప్పనిసరి

రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు జోగిరెడ్డి



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు, జోగిరెడ్డి

యాచారం: వేసవి కాలంలో పశుపోషణపై జాగ్రత్తలు అవసరమని రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు కొంగళ్ల జోగిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నందివనపర్తిలో సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 750 పాడిపశువులు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ.. పశు పోషణ, వ్యాధుల నివారణపై సకాలంలో గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తే ఇబ్బందులు ఉండవని అన్నారు.

చిన్నారెడ్డికి సన్మానం



చిన్నారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన చెన్నకిషన్‌రెడ్డి

కడ్తాల్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన జిల్లెల చిన్నారెడ్డిని శనివారం హైదరాబాద్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లాల పశుపోషణ సంఘం అధ్యక్షుడు గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి, సమస్యలపై చిన్నారెడ్డితో చర్చించినట్లు చెన్నకిషన్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

కుళ్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం రూరల్: కుళ్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ హెచ్చరించారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలోని పలు హోటళ్లను కమిషనర్ బాలకృష్ణ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. కుళ్లిన ఆహార పదార్థాలను గుర్తించారు. కిచెన్‌లో అపరిశుభ్రతపై యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా కూరగాయాలతో వంట చేయాలని సూచించారు. మాంసహారం కూడా ఎప్పటిది అప్పుడే ఫ్రెష్‌గా ఉండాలని ఫ్రిజ్‌లో పెట్టి నిల్వచేస్తే చర్యలు తీసుకుంటామని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే సహించేది లేదన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృత్తం అయితే హోటళ్లకు జరిమానాతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో మేనేజర్ శ్రీనివాస్, ఎన్విరాల్‌మెంట్ సురేష్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



హోటళ్లను తనిఖీ చేస్తున్న బాలకృష్ణ, సిబ్బంది

రూ.4.5 లక్షల విలువైన సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న సీఐ

ఇబ్రహీంపట్నం రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ అన్నారు. ఠాణా పరిధిలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు రూ.4.5లక్షల విలువైన 18 సెల్‌ఫోన్లను ఇబ్రహీంపట్నం పోలీసులు రికవరీ చేశారన్నారు. శనివారం బాధితులకు స్టేషన్‌లో తమ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. సెల్‌ఫోన్ల రికవరీకి యత్నించిన క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, నగేశ్, కోటేశ్వర్‌రావు, బాబు, శ్రీలత, కవితలను అభినందించారు.

కళ్లద్దాల పంపిణీ

కందుకూరు: ఇటీవల గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. శనివారం లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి శ్రీరాముల జ్ఞానేశ్వర్, యాదగిరి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న వైస్ ఛైర్మన్ జీఎస్ కోహ్లి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

- గురునానక్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లి
- గురునానక్‌లో బ్రుమోస్ ఫీస్టా టెక్నో కల్చరల్ ఫెస్ట్ 2024
- ఆలరించిన విద్యార్థుల ప్రదర్శనలు

ఇబ్రహీంపట్నం రూరల్: దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని గురునానక్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ సర్దార్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లి పేర్కొన్నారు. బ్రుమోస్ ఫీస్టా టెక్నో కల్చరల్ ఫెస్ట్–2024 ఆదివారం ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యా సంస్థలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్లాష్‌మాబ్, గానం, వాయిద్యా, పోలో, టాలీవుడ్, బాలీవుడ్ క్విజ్, సోలో గ్రూప్ డ్యాన్స్ ,టగ్‌ఆఫ్‌వార్, మ్యూజికల్ చైర్స్, రంగోలితో పాటు వివిధ రకరకాల ఆటలు, పాటలతో ఆలరింపజేశారు. అనంతరం వైస్ ఛైర్మన్ సర్దార్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లి మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం చదువులే కాకుండా ప్రతిభ పాటవాలను ఒకరితో ఒకరు పంచుకోంటూ నూతన ఆవిష్కరణల మీద దృష్టి పెట్టాలని కోరారు. వివిధ భిన్నా అభిప్రాయాలు ఉన్న మన దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఉన్నతమైన చదువులు చదివి దేశానికి ఉపయోగపడలన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్‌ఎస్ సైని మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు, ఆటవిడుపుగా ఉంటూ విద్యార్థుల మధ్య గురువు శిష్యుల సంబంధం బలంగా ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనాథ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి, అసోసియేట్ డైరెక్టర్ రిషిసాయల్, డీన్ డాక్టర్ ఎస్‌వి రంగనాయకులు, డాక్టర్ సంజీవ్, ఈవెంట్ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ హరీష్‌కుంద్రా, వికెచారీలతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం కసిరెడ్డి నారాయణరెడ్డిని మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో చంద్రాయణపల్లితండావాసులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. చంద్రాయణపల్లి తండా, విఠాయిపల్లి, పెంటతండాల్లో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నామని, ఇందుకు ప్రతిపాదనలు పూర్తయ్యాయని ఆయన వివరించారు. మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువ నిర్మిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాగ్యానాయక్, శ్రీదర్‌నాయక్, హర్య, గోపాల్‌నాయక్, తిరుమలేశ్, గోపాల్, గోపి, రవి, మల్లేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న తండావాసులు

కళ్యాణోత్సవానికి రండి

మాడ్గుల మండలం అవురుపల్లి–నల్లవారిపల్లి గ్రామాల పరిధిలోని నాగులగుట్టపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 8న నిర్వహించే శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరు కావాలని ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆహ్వానించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆలయ నిర్వాహకులు వెంకటయ్య, మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు నర్సింహా, నాయకులు యాదయ్యగౌడ్, మధుసూదన్, తిరుపతయ్య కలిశారు. ఈ సందర్భంగా ఆలయ ఆహ్వానపత్రికను ఎమ్మెల్యే కసిరెడ్డికి అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఇబ్రహీంపట్నం రూరల్: సాహెబ్‌గూడలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్‌క్యాంపు శనివారం నిర్వహించారు. 150 మందికి పైగా పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్తు మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ జహంఘీర్‌ఖాన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌సీ కేంద్రం రంగారెడ్డి జిల్లా మెడికల్ అధికారి డాక్టర్ నిహా అహ్మద్, సీఎస్‌సీ హెల్త్‌కేర్ సాయితేజ, శివ, రాజశ్రీలతో పాటు తదితరులు పాల్గొన్నారు. మహిళా అధ్యక్షురాలు రమేశ్వరి, ముస్లిం మహిళా అధ్యక్షురాలు పైమీద, ఎస్సీసెల్ అధ్యక్షురాలు లక్ష్మమ్మ, మహిళా గ్రూపు సంఘం అధ్యక్షురాలు కవితలు పాల్గొన్నారు.



రోగులకు రిపోర్టు అందజేసిన డాక్టర్లు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: మానసిక ఒత్తిడి అనారోగ్యం కారణంగా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కరీంనగర్ జిల్లాకు చెందిన గున్నాల పూర్ణచందర్(36) కుటుంబ సభ్యులు నాదర్‌గుల్ సమీపంలో గ్రీన్‌హోమ్స్ కాలనీలో నివాసం ఉండేవారు. భార్య ప్రైవేటు ఉద్యోగి. వీరిద్దరికి ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్య ఉద్యోగానికి వెళ్లిన తర్వాత పూర్ణచందర్ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం వచ్చిన భార్యకు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అవిశ్వాసం వీగినట్లేనా..?



మాట్లాడుతున్న మల్‌రెడ్డి అనురాధ

- 5న నిర్వహించే సమావేశానికి కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరం
- మున్సిపల్ ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పెట్టిన అవిశ్వాసం వీగినట్లేనా అంటే అవుననే సమాధానమే వస్తోంది. పాలక వర్గం అవిశ్వాస తీర్మానానికి ఇచ్చిన నోటీసుల ప్రకారం ఈ నెల 5న సమావేశం నిర్వహించనున్నారు. కాగా ఈ సమావేశానికి కాంగ్రెస్ కౌన్సిర్లు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రెడ్డి తొర్రూర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీలోని పాలకవర్గంలో విభేదాల కారణంగా వైస్‌ఛైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితపై అవిశ్వాసం పెట్టాలని కొంత మంది కౌన్సిలర్లు నిర్ణయించుకుని కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చారన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జోక్యం చేసుకుని విభేదాలను చక్కదిద్దడంతో వివాదం సద్దుమణిగిందన్నారు. కొన్ని రోజులుగా నెలకొన్న ఈ ఉత్కంఠకు తెరపడింది. కేవలం బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన కౌన్సిలర్లు హాజరైతే సరిపడా కోరం ఉండదని.. దీంతో అవిశ్వాసం వీగిపోయే అవకాశం ఉందని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, కంబాలపల్లి ధన్‌రాజ్, నారని కవిత, బాల్‌రాజ్, కాకుమాను సునీల్, నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్, మేతరి దర్శన్, కుంట గోపాల్‌రెడ్డి, రేవల్లి యాదగిరి, గుండ ధన్‌రాజ్, బొక్క వంశీధర్ రెడ్డి, ఎండీ గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

జాతరకు వేళాయె



కొండపై మల్లన్న ఆలయం



ఆలయంలో కొలువైన మల్లన్న స్వామి

- ఐదు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మల్లన్న స్వామి
- ఏక్వాయిపల్లిలో ఏర్పాట్లు ముమ్మరం

ఉత్సవ వివరాలు

తేది	పూజలు
మార్చి 8న	గణపతిపూజ, పంచామృతాభిషేకం, కల్యాణం, ఒగ్గుకథ
9న	అగ్నిగుండాలు
10న	ప్రత్యేక పూజలు, రథోత్సవం
11న	అర్చనలు, విశేషపూజలు, దోపోత్సవం, ఒగ్గుకథ
12న	చక్రతీర్థం, ఒగ్గుకథ

కడ్తాల్: మండల పరిధిలోని ఎక్వాయిపల్లి సమీపంలో మల్లన్న గుట్టపై వెలసిన మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 8 నుంచి 12వరకు నిర్వహించనున్నారు. ఐదురోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. కొండపై వెలసిన మల్లన్న స్వామికి ప్రతీ శివరాత్రికి జాతర నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలకు మండల వాసులతో పాటు కల్వకుర్తి, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, యాచారం, మాల్, చింతపల్లి, చరికొండ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివస్తారని ఆలయ ప్రధాన ధర్మకర్త ఎట్టయ్య యాదవ్ వివరించారు.